క్లుప్తంగా

అదృశ్యమైన తల్లీ కుమార్తె ఆచూకీ లభ్యం



అదృశ్యమైన లలితతో మహిళా కానిస్టేబుల్ దేవి

మునగపాక: మండలంలోని ఒంపోలు గ్రామంలో అదృశ్యమైన వివాహిత లలిత, ఆమె కుమార్తె ఆచూకీ లభ్యమైంది. గ్రామానికి చెందిన దాసరి సన్యాసినాయుడు, లలిత దంపతుల మధ్య ఇటీవల గొడవ జరగడంతో లలిత తన చెల్లి ఇంటికి వెళ్లిపోయింది. విషయం తెలియక సన్యాసినాయుడు మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టగా.. రెండేళ్ల పాప రియాన్సీతో కలిసి లలిత తన చెల్లి ఇంటి వద్ద ఉన్నట్లు గుర్తించారు. దీంతో మహిళా కానిస్టేబుల్ దేవి.. లలితను స్టేషన్‌కు తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

యోగాంధ్ర విజయవంతం కావాలి

మునగపాక: యోగాంధ్ర కార్యక్రమం విజయవంతంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. స్థానిక మండల పరిషత్ హాలులో సోమవారం యోగాంధ్ర కార్యక్రమంపై జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించడంతో పాటు యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా చూడాలన్నారు. యోగా చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు, వైద్యాధికారి నాగలక్ష్మి, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఎంఆర్ వ్యాక్సినేషన్ ప్రక్రియ పరిశీలన



వ్యాక్సినేషన్ వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి చంద్రశేఖర్

మునగపాక: మునగపాక పీహెచ్‌సీని సోమవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ సందర్శించారు. మీజిల్స్ రుబెల్లా(ఎంఆర్) వ్యాక్సినేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు . ఈ నెల 31వ తేదీ వరకు వ్యాక్సినేషన్ నిర్వహించాలన్నారు. వ్యాక్సిన్‌ను నిల్వ చేసే రిఫ్రిజిరేటర్‌ను పరిశీలించారు. ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న వ్యాక్సినేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంకాధికారి రామచంద్రరావు, వైద్యాధికారి మద్దాల నాగలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా కృషి చేస్తున్నట్టు ఎంపీడీవో ఎం.ఉషారాణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల స్థాయి అధికారులతో నిర్వహించే వేదికను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానికంగా అధికారులు ఉండడంతో సమస్య పరిష్కారం కాగలదన్నారు. మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్, ఈవోఆర్డీ సోమరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, ఉపాధి హామీ పథకం ఏపీవో శివ, విద్యుత్ శాఖ ఏఈ జగదీష్ , ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వదలని వాన..



కోటవురట్లలో కురుస్తున్న వర్షం

కోటవురట్ల: రోహిణీ కార్తెలో వర్షాలు దంచికొడుతున్నాయి. వాస్తవానికి ఈ కార్తె ప్రారంభం నుంచి రోళ్లు పగిలేలా ఎండలు మండిపోతాయని అంటుంటారు. కానీ రెండు రోజులుగా వరుణుడు పలకరించి పోతున్నాడు. మండే ఎండల నుంచి ఉపశమనం కలిగిస్తున్నాడు. సోమవారం మండలంలో సుమారు గంట పాటు కుండపోత వర్షం కురిసింది. యండపల్లి ప్రాంతంలో ఏకధాటిగా కురిసిన వర్షానికి రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాలు, కాలువల్లోకి భారీగా నీరు చేరింది. వాతావరణం మారడంతో చల్లటి గాలులతో ఆహ్లాదాన్ని చవిచూస్తున్నారు.

అన్నదాత కష్టేభవ!

- రైతుకు పెట్టుబడి సాయంపై మీనమేషాలు
- మండలంలో పూర్తయిన రైతుల పరిశీలన
- తరచూ సర్వర్ మొరాయింపుతో అవస్థలు
- ఖరీఫ్ సమీపిస్తున్నా పెట్టుబడి సాయం సందేహమే!

వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం నానాటికీ పెరుగుతోంది. పండిన పంటలకు గిట్టుబాటు ధర దక్కట్లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో వారికి దన్నుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలవాలి. వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించడం, రాయితీపై ఎరువులు, విత్తనాలు అందించడం, మద్దతు ధర కల్పించడం వంటి వాటి ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రయత్నించాలి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇవేవీ రైతులకు అంత ఆషామాషీగా దక్కేలా కనిపించట్లేదు.



మునగపాక సచివాలయంలో ఈకేవైసీ చేస్తున్న అధికారులు

మునగపాక: కూటమి ప్రభుత్వంలో వ్యవసాయానికి ప్రోత్సాహం కరవైంది. ఎన్నికల హామీల్లో ప్రతి రైతుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం హామీ ఇంకా అమల్లోకి రాలేదు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తోంది. దీంతో అన్నదాత సుఖీభవ ద్వారా అర్హులైన రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయంపై ప్రభుత్వంలో కదలిక మొదలైంది. ప్రభుత్వ, వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు మండలంలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే)/ప్రస్తుత రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బంది రైతుల ఖాతాల పరిశీలన చేపట్టారు. దీనిపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడంతో పరిశీలన మందకొడిగా సాగుతోంది.

కొనసాగుతున్న ఖాతాల పరిశీలన

వాస్తవంగా సోమవారంతో గడువు ముగియాల్సి ఉండగా, తరచూ సర్వర్ మొరాయించడంతో గడువును ఈ నెల 25 వరకూ పొడిగించారు. అన్నదాత సుఖీభవపై ప్రాథమిక స్థాయి పరిశీలనలో భాగంగా గత ప్రభుత్వంలోని అర్హుల జాబితాను పరిశీలిస్తున్నారు. ఈ జాబితా మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటి వరకూ అన్నదాత సుఖీభవ పథకం విధి విధానాలను విడుదల చేయకపోవడం, కొత్తగా రైతుల నమోదుకు అవకాశం కల్పించకపోవడంతో లబ్ధిదారుల్లో కోత విధిస్తారేమోనన్న ఆందోళన నెలకొంది.

అప్పట్లో వలంటీర్ల ద్వారానే నమోదు

గత ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామంలోని వలంటీర్లతో సమన్వయం చేసుకుని రైతుల వివరాలు సేకరించి నమోదు చేసేవాళ్లు. ప్రస్తుతం అటువంటి వెసులుబాటు ఏమీ లేకపోవడంతో రైతు సేవా కేంద్రాలకు వెళ్లి తమ వివరాలు నమోదు చేయించుకుంటున్నారు. సర్వర్ తరచూ మొరాయించడం.. సిబ్బందికి ఖాళీ లేకపోవడంతో రోజూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

మండలంలో వివరాలు

- గ్రామ పంచాయతీలు 26
- మొత్తం వ్యవసాయ భూమి 7450 హెక్టార్లు
- మొత్తం రైతు ఖాతాలు 17,536
- డేటా పరిశీలన అయినవి 16,452
- గత ప్రభుత్వంలో రైతు భరోసా లబ్ధిదారులు 7,600 మంది
- ఏడాదికి ఒక్కో రైతులుకు అందిన సాయం రూ.13,500
- మండలంలో ఏడాదికి అందించిన లబ్ధి రూ.10.26 కోట్లు



వాడ్రాపల్లిలో వరిపైరు

అన్నదాతకు అండగా జగన్ ప్రభుత్వం

గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా వ్యవసాయానికి పెద్దపీట వేసింది. రైతుల చెంతకే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది వెళ్లి ప్రోత్సాహకాలు అందించేలా చర్యలు తీసుకుంది. సచివాలయ పరిధిలో ఆర్బీకేల ఏర్పాటు, రైతులకు రాయితీపై ఎరువులు, విత్తనాల పంపిణీ, ఉచిత పంటల బీమా అందించింది. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా సచివాలయం కేంద్రంగా రైతు సేవా యూనిట్లలో వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు అందుబాటులోకి తెచ్చింది. రైతులకు సత్వర సేవలందించేందుకు వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ సహాయకులను నియమించింది. రైతులు పండించిన పంటకు మద్దతు ధర ప్రకటించడంతో పాటు, రైతుల చెంతకే వెళ్లి వారు పండించిన పంటలను ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసి, అన్నివేళలా అన్నదాతకు అండగా నిలిచింది.

అర్హులకు తప్పకుండా సాయం



అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందుతుంది. ఇప్పటికే గ్రామాల వారీగా రైతుల డేటా సేకరణ పూర్తి చేశాం. జూన్ 12న రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. పీఎం కిసాన్‌తో కలిపి ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేల మేర సాయం అందుతుంది. ఆధార్‌కు, ఫోన్ నంబరు లింక్ సక్రమంగా లేకపోవడంతో అక్కడక్కడ డేటా సేకరణకు అంతరాయం కలిగింది.

– సీహెచ్.జ్యోత్స్నకుమారి, మండల వ్యవసాయాధికారి

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



మాట్లాడుతున్న ఉపాధ్యాయురాలు గౌరి

అచ్యుతాపురం రూరల్ : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని అచ్యుతా పాఠశాల ఉపాధ్యాయురాలు గౌరి అన్నారు. అచ్యుతాపురం గ్రంథాలయంలో వేసవి శిబిరాల్లో భాగంగా సోమవారం ఆమె విద్యార్థినులతో మాట్లాడారు. మహిళలు దేశాభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారన్నారు. స్త్రీలు అంతరిక్షయాణం, యుద్ధ, రాజకీయ రంగాల్లో పోషిస్తున్న పాత్ర ప్రపంచానికి గర్వ కారణమన్నారు. మనోధైర్యంతో ఎంతటి విజయాన్నైనా అవలీలగా సాధించే శక్తి మహిళల్లో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి.కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు



రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

ఎస్.రాయవరం: గోకులపాడు గ్రామంలో రోడ్డు గుంతలతో నిండిపోయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మరింత అధ్వానంగా తయారైంది. గ్రామాల పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని నిబంధనలు ఉన్నప్పటికీ గోకులపాడు నుంచి భీమవరం వెళ్లే రోడ్డులో గోకులపాడు గ్రామంలో నివాసాల మధ్య కొంత మేర తారురోడ్డు వేశారు. ఆ ప్రాంతంలో ఇళ్లలో వాడుక నీరు, వర్షపునీరు రోడ్డుపై నిలిచిపోవడంతో రోడ్డు త్వరగా పాడైపోయింది. దీంతో గ్రామస్తులతో భీమవరం వాసులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పరిశీలించి గోకులపాడు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

చూడి పశువు సంరక్షణపై శ్రద్ధ అవసరం



చూడి పశువు

కోటవురట్ల: చూడి పశుపోషణ పట్ల తగు జాగ్రత్తలు పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయి. రైతుకు వ్యవసాయం ఎంత ముఖ్యమో పాడి కూడా అంతకు మంచి ఆదాయాన్ని ఇస్తుంది. పాడి పశువు ఎంపిక నుంచి పోషణ, సంరక్షణ పట్ల శ్రద్ధ వహిస్తే లాభాలు వాటంతట అవే వస్తాయి.

చూడి పశువు సంరక్షణ ఇలా...

పశువు గర్భం దాల్చిన నాటి నుంచి చూడి పశువుకు, గర్భంలో పెరుగుతున్న దూడకు సంరక్షణ అవసరం. గర్భ కాలంలో మొదటి కొద్ది నెలలో పెరిగిన దాని కంటే చివరి రెండు నెలలో 4 రెట్లు వేగంగా దూడ పెరుగుతుంది. అందువల్ల చూడి పశువుల సంరక్షణలో జాగ్రత్తలు చాలా అవసరం. చూడి చివరి రెండు నెలలో దాణాను పెంచడంతో పాటు పప్పు జాతికి చెందిన గడ్డి రూపంలో అధిక పోషకాలను అందించాలి. ఇలా చేయడం వల్ల దూడ పెరుగుదలకే కాకుండా పశువు ఈనిన వెంటనే పాల ఉత్పత్తి పెరుగుతుంది. చూడి పశువు ఈనే వరకు పాలు తియ్యటం మంచిది కాదు. ఈనడానికి రెండు నెలల ముందు(7వ నెల) నుంచి పాలను తీయడం మానేయాలి. అలా చేస్తే ఈత తర్వాత పాల ఉత్పత్తి తగ్గదు. పుట్టిన దూడకు పొట్టలో పురుగులు, నట్టల సమస్య లేకుండా చూడి చివరి 3 నెలల్లో చూడి పశువుకు పురుగులను నిర్మూలించేలా మందు వేయాలి. పాలు పితకడం ఆపిన తర్వాతి కాలంలో చూడి పశువు బరువు గణనీయంగా పెరిగేలా చూడాలి. చివరి రెండు నెలల్లో 45–60 కిలోల బరువు పెరగాలి.

ఈతకు ముందు జాగ్రత్తలు

ఈతకు ముందు ఆవు శరీరంలో, ప్రవర్తనలో స్వల్ప మార్పులు వస్తాయి. ఈనడానికి రెండు వారాల ముందు పొదుగు పెద్దగా అవుతుంది. కొన్ని సందర్భాలలో పొదుగు నుంచి పాలు కారుతుంటాయి. మానం ఉబ్బి తెల్లటి ద్రవం కారుతుంటుంది. పెల్విక్ లిగమెంట్లు వదులుగా అవుతాయి. పశువు ఆందోళనగా ఉండి సక్రమంగా మేయదు. ఈ సమయంలో పశువు ఈనడానికి అవసరమైన వాతావరణాన్ని కల్పించాలి. ఈతకి వారం ముందు చూడి పశువును మిగిలిన పశువుల నుంచి వేరు చేసి పొడిగా, శుభ్రంగా , ప్రశాంతంగా ఉండే కొట్టాంలో కట్టాలి. పొడిగా ఉండేలా ఎండుగడ్డితో పక్క వేయాలి. ఎక్కువ పాల దిగుబడినిచ్చే పశువులలో ఈనిన వెంటనే పాల జ్వరం రాకుండా చూలుతో ఉన్న సమయంలో కాల్షియం, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఇవ్వాలి. ఈనడానికి ఒక వారం ముందు విటమిన్ డీ ఇంజక్షన్ వేయించాలి.

- నీటి సంచి కనిపించిన రెండు గంటలకు కూడా దూడ కాళ్లు బయటకు రాకపోతే వెంటనే వైద్యుని సంప్రదించాలి.
- దూడ కాళ్లు కనబడిన అరగంట తరువాత కూడా ఎటువంటి మార్పు కనబడకపోతే వెంటనే సంప్రదించాలి.
- రెండు కాళ్లకు బదులు ఒక కాలు మాత్రమే బయట కనబడినా డాక్టరుకు చూపించాలి.
- ఈనిన 24 గంటలలోపు మాయ పడకపోయినా వైద్యునికి చూపించాలి.

రీసర్వే వేగవంతం కావాలి

మునగపాక: రీ–సర్వే పనులు వేగవంతం కావాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం సాయంత్రం వీఆర్వోలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ–సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. రైతుల సమస్యలను స్థానికంగా పరిష్కరించేలా చూడాలన్నారు. డీటీ శేషుబాబు, ఆర్ఐ పడాల్‌తో పాటు పలువురు వీఆర్వోలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్ చేపట్టరూ..



నీలిగుంట వెళ్లే రహదారిలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

కోటవురట్ల: రహదారుల్లో భద్రత కరువైంది. అధ్వాన రహదారులకు పిచ్చిమొక్కలు తోడవ్వడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చాలా కాలంగా జంగిల్ క్లియరెన్సు చేపట్టకపోవడంతో పలు రహదారులు ప్రమాదకరంగా మారాయి. అసలే ఇరుకు రోడ్లు.. ఆపై రెండు వైపులా దట్టంగా అలుముకున్న పిచ్చిమొక్కలు వాహనదారులకు నరకాన్ని చూపిస్తున్నాయి. ప్రధానంగా మలుపుల్లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు వాలిపోయి ఎదుట వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అన్నవరం, లింగాపురం–కొడవటిపూడి, చౌడువాడ, రాజుపేట, అల్లుమియ్యపాలెం , రామచంద్రపాలెం–నీలిగుంట, భీమిరెడ్డిపాలెం–పాములవాక, చినబొడ్డేపల్లి రహదారులల్లో ఈ పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్సు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం



వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

పాయకరావుపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం విద్యార్థులకు తాళ్ళరావు లెక్కలు బోధించారు. నీతి కథలు చెప్పారు. బీఆర్ అంబేడ్కర్‌పై వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు.

సమన్వయంతోనే యోగాంధ్ర విజయవంతం



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో

నక్కపల్లి: యోగాంధ్ర–2025 విజయవంతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని నక్కపల్లి ఎంపీడీవో డి.సీతారామరాజు చెప్పారు. సోమవారం ఉదయం నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్రపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, విద్యాశాఖ, రెవెన్యూ శాఖ మండల పరిషత్, ఉపాధి హామీ పథకం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో యోగాంధ్ర ప్రోటోకాల్‌ను జయప్రదం చేయాలని సూచించారు. తహసీల్దార్ నరసింహమూర్తి మాట్లాడుతూ యోగాంధ్ర యాప్‌లో నమోదు చేసుకున్న వారంతా ఒక్కొక్కరు 50 మందితో రిజిస్ట్రేషన్ చేయించాలని చెప్పారు. మంగళవారం ఉదయం నక్కపల్లిలో కొన్ని పంచాయతీల పరిధిలో ఉద్యోగులు సిబ్బందికి ప్రోటోకాల్ యోగా శిక్షణ ఉటుందన్నారు. ఈ సమావేశంలో ఆయుష్ డాక్టర్ రఘు, ఎంఈవో కె.నరేష్, తెలుగు పండిట్ ఎస్‌వీఎస్ ఆచార్యులు, యోగా శిక్షకులు డి.రాంబాబు, ఉపాధ్యాయులు అప్పలరాజు, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు విస్మరించిన కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

మునగపాక: మహిళలు తమ సమస్యలను సంఘటితంగా ఎదుర్కోవాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి పిలుపునిచ్చారు. మండలంలోని తిమ్మరాజుపేట డావెన్సీ అంతర్జాతీయ పాఠశాలల్లో ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలకు కారణం ప్రభుత్వం పెట్టుబడి దారులు, వ్యాపారుల లాభాలకు పెద్దపీట వేయడమే అన్నారు. ఉపాధి లేక తక్కువ వేతనాలకు మహిళలు అధిక శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం జరుగుతున్న ఆందోళన కార్యక్రమానికి ఐద్వా సంపూర్ణ మద్దతు అందిస్తుందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లోగా గంజాయిని నిర్మూలిస్తామంటూ ఊకదంపుడు ప్రచారం చేయడం మినహా ఒరిగిందేమీ లేదన్నారు. మహిళలంతా ఐక్యంగా ఉంటూ సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలన్నారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి, అనకాపల్లి ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు పి.మాణిక్యం, డీడీ వరలక్ష్మి, పూర్ణ, రమణి, సుభాషిని, మంగతాయారు, సూర్యప్రభ, తదితరులు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో ట్రాఫిక్ సమస్య



ట్రాఫిక్‌లో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరం మెయిన్ రోడ్డు ఇరుకుగా మారడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. వారపు సంత పూట సోమవారం ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. దుకాణాలు పెరగడంతో వైఎస్సార్ విగ్రహం నుంచి గురజాడ విగ్రహం వరకు రోడ్డు మరింత సమస్యాత్మకంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి రథయాత్ర



మాడుగులలో భగవాన్ సత్యసాయి రథయాత్ర



దేవరాపల్లిలో సత్యసాయి రథయాత్రలో పాల్గొన్న భక్తజనం

మాడుగుల : భగవన్ సత్యసాయి 100వ జన్మదిన వేడుకల్లో భాగంగా సోమవారం రథయాత్ర నిర్వహించారు. పురవీధుల్లో అధిక సంఖ్యలో భక్తులు భజనలు చేస్తూ రథయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కర్నూరు అప్పలనాయుడు, లోవరాజు, రవిశంకర్, కె. శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

దేవరాపల్లి: భగవాన్ సత్యసాయి ప్రేమ రథయాత్ర సోమవారం సాయంత్రం చేరుకుంది. మహేశ్వరీ థియేటర్ నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా స్థానిక సత్యసాయి ధ్యాన మందిరానికి చేరుకున్న సత్యసాయి రథయాత్రకు భక్తులు అడుగడుగునా పూజలు చేస్తూ ఘన స్వాగతం పలికారు. స్థానిక ధ్యాన మందిరంలో పూజా కార్యక్రమాలు అనంతరం కె.కోటపాడు బయలుదేరింది. బాబా నామ స్మరణంతో దేవరాపల్లి మారుమోగింది.

అనకాపల్లి విద్యార్థినికి జిల్లా ఫస్ట్ ర్యాంకు



చౌదరి గీత

అనకాపల్లి: పట్టణంలోని సాయి కుల్వంత్ కళాశాల విద్యార్థిని చౌదరి గీత బీబీఏ ఫలితాల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఈ నెల 24న ఏయూ విడుదల చేసిన డిగ్రీ ఫలితాల్లో తమ విద్యార్థిని జిల్లా స్థాయి ర్యాంకు సాధించడం ఆనందంగా ఉందని కళాశాల కరస్పాండెంట్ ఎం.కామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్లుగా బీబీఏలో తమ కళాశాల విద్యార్థులు జిల్లా ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు.

మహిళలకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలో పాల్గొన్న మహిళలు

యలమంచిలి రూరల్: సంఘ సంస్కర్త, మహిళా సాధికారతకు ఎనలేని కృషి చేసిన మహారాణి అహల్యా భాయ్ హోల్కర్ 300వ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆమె జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 63 మంది మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. అంతకు ముందు ఈ పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి ప్రారంభించారు. మహిళలు మహారాణి అహల్యా భాయ్ హోల్కర్ చరిత్ర తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది పద్మావతి, ఉమ, రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

మోదకొండమ్మ జాతరకు జోరుగా ఏర్పాట్లు



ప్రత్యేక అలంకరణలో మోదకొండమ్మ

మాడుగుల : వచ్చే నెల 3న మాడుగుల మోదకొండమ్మ పండగను పురస్కరించుకుని జోరుగా ఏర్పాట్లు చేస్తున్నారు. కళ్లు మిరుమిట్లు గొలిపే విధంగా భారీ స్థాయిలో విద్యుత్ లైటింగ్‌కు, భారీ నేల వేషాలకు సెట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. సతకం పట్టు స్టేజీపై ఈ నెల 30వ తేదీన క్లాసికల్ డ్యాన్స్‌తో పాటు కోలాటాలు, ఈనెల 31న జానకీరామ్ తిరుపతి బృందంతో రేలా రేరేలా, జూన్1వ తేదీన హైదరాబాద్ వారి డ్యాన్స్ మస్తీడ్యాన్స్, 2వ తేదీన హైదరాబాద్‌వారి డ్యాన్స్ ఉత్సవ్, పండగ రోజు, 3వ తేదీన చింతామణి గయోపాఖ్యానం నాటకంతో పాటు చిత్ర విచిత్రమైన నేల వేషాలు, పలు డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఆలయానికి రంగులు అద్ది ఆకర్షణీయంగా తయారు చేశారు.